సాక్షి అనంతపురం

శుక్రవారం । 5 । ఏప్రిల్ । 2024

I



టన్ను చీనీ రూ.31 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీ కాయలు గరిష్టంగా రూ.31 వేలు పలికాయి.



కిలో టమాట రూ.13

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.13, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

శుక్రవారం	శనివారం
సాయంత్రం	ఉదయం
ఇఫ్తార్ : 6.34	సెహరీ : 4.55



న్యూస్‌రీల్

జిల్లాకు 832 మెట్రిక్ టన్నుల యూరియా



యూరియాను పరిశీలిస్తున్న ఏడీఏ ఎం.రవి

అనంతపురం అగ్రికల్చర్: రబీ ప్రణాళికలో భాగంగా నెలవారీ కోటా మేరకు కోరమాండల్ కంపెనీ నుంచి 832 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా అయినట్లు ఏడీఏ ఎం.రవి తెలిపారు. గురువారం ఆయన స్థానిక ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ రేక్‌పాయింట్‌లో వ్యాగన్ల ద్వారా వచ్చిన యూరియాను పరిశీలించారు. కలెక్టర్, జేసీ, డీఏఓ ఆదేశాల మేరకు 806 మెట్రిక్ టన్నులు ప్రైవేట్ హోల్‌సేల్ డీలర్లకు సరఫరా చేశామని, మిగతా 26 మెట్రిక్ టన్నుల యూరియాను కంపెనీ గోదాముల్లో నిల్వ చేసినట్లు వెల్లడించారు.

కలెక్టర్‌గా వినోద్‌కుమార్



అనంతపురం అర్బన్: జిల్లా కలెక్టర్‌గా వి.వినోద్ కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వినోద్‌కుమార్ 2016 సంవత్సరంలో అసిస్టెంట్ కలెక్టర్‌గా (ట్రైనీ కలెక్టర్) జిల్లాలో విధులు నిర్వర్తించారు.

ఎస్పీగా అమిత్ బర్దార్



అనంతపురం: జిల్లా నూతన ఎస్పీగా అమిత బర్దార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడమే లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగంతో కలిసి పారదర్శకంగా ప్రక్రియ చేపడతామన్నారు. అంతకుముందు పోలీసు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

- అమిత్ బర్దార్ రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారు. చెన్నై ఐఐటీలో బీటెక్ పూర్తి చేశారు. ఖరగ్‌పూర్ ఐఐటీలో ఉద్యోగం చేసే సమయంలో సివిల్స్ సర్వీసెస్ సాధించి 2011లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శ్రీకాకుళం ఎస్పీగా పనిచేశారు. ప్రస్తుతం 14వ బెటాలియన్ కమాండెంట్‌గా ఉన్నారు. ఈ క్రమంలోనే జిల్లా ఎస్పీగా ప్రభుత్వం బదిలీ చేసింది.

జడ్జిల బదిలీ



అనంతపురం: జిల్లాలోని పలు కోర్టుల్లో పనిచేస్తున్న సీనియర్ జడ్జిలు బదిలీ అయ్యారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం కోర్టులో పనిచేస్తున్న ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి. దీన.. ఒంగోలు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా బదిలీ అయ్యారు. పెనుకొండ కోర్టులో పనిచేస్తున్న సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం. శంకర్రావును అనంతపురం సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. అలాగే, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జి. శివ ప్రసాద్ యాదవ్‌ను జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా నియమించారు. బొబ్బిలిలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా ఉన్న టి. వాసుదేవన్‌ను పెనుకొండకు బదిలీ చేశారు.

పయ్యావుల ఆగడాలకు చెక్

కూడేరు: యువత ఓట్లు దండుకునేందుకు క్రికెట్ టోర్నీ పేరిట ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తెరలేపిన ప్రలోభ పర్వానికి అధికారులు చెక్‌పెట్టారు. వివరాలు.. కూడేరు మండల పరిధిలోని ఎంఎంహళ్లిలో పయ్యావుల బ్రదర్స్ అండ్ శ్రీధర్ చౌదరి సహకారం పేరిట గురువారం క్రికెట్ టోర్నీ నిర్వహించేందుకు టీడీపీ నేతలు సిద్ధమయ్యారు. విన్నర్ జట్టుకు రూ.30 వేలు, రన్నర్ జట్టుకు రూ.15 వేలు ప్రకటించి ఇప్పటికే పెద్ద ఎత్తున కరపత్రాలు పంపిణీ చేశారు. అయితే, విషయం తెలుసుకున్న మండల ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసీసీ) అధికారి ముస్తఫా కమల్ బాషా సీరియస్ అయ్యారు. గురువారం పోలీసులు, పంచాయతీ సిబ్బందిని గ్రామానికి పంపి టోర్నీ నిర్వహణను అడ్డుకున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న సమయంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం నేరమని స్పష్టం చేశారు.



ఆస్పత్రిలో బెడ్‌పై అపస్మారక స్థితిలో పడిఉన్న ఈ వృద్ధురాలి పేరు బోయ సుంకమ్మ. ఉరవకొండ మండలం లత్తవరం గ్రామం. టీడీపీ అధినేత చంద్రబాబు పన్నిన కుట్ర కారణంగా పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లు దూరమైన విషయం తెలిసిందే. దీంతో తమ గ్రామంలోని సచివాలయం వద్ద పింఛన్ తీసుకునేందుకు సుంకమ్మ వెళ్లారు. ఎండలో చాలాసేపు నిరీక్షించిన అనంతరం డబ్బు అందుకుని తిరిగి ఇంటికి బయలుదేరారు. అప్పటికే పూర్తిగా నీరసించిపోయి ఉండడంతో మార్గమధ్యలో కాలుజారి పడిపోయారు. కుటుంబీకులు ఆమెను ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు కాలి ఎముక విరిగిందని తెలిపారు.

అనంతపురంలోని ఓ సచివాలయం వద్ద పింఛన్ల కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు, (ఇన్‌సెట్) చేతి కర్ర సాయంతో సచివాలయానికి వస్తున్న వృద్ధురాలు



చంద్రబాబు పగ
పండుటాకు వ్యథ

- రెండో రోజూ పింఛన్‌దారుల అవస్థలు
- ఎండలో వృద్ధుల విలవిల
- వడదెబ్బ తగిలి ఉమ్మడి జిల్లాలో ముగ్గురి మృత్యువాత
- పింఛన్ అందదేమోనన్న బెంగతో మడకశిరలో ఒకరి కన్నుమూత

అనంతపురం క్రైం/సాక్షి నెట్‌వర్క్: చంద్రబాబు నిర్వాకం కారణంగా పింఛన్‌దారులు రెండో రోజూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండలో వృద్ధులు విలవిల్లాడిపోయారు. గురువారం కూడా జిల్లా వ్యాప్తంగా సచివాలయాలు సామాజిక భద్రతా పింఛన్‌దారులతో కిటకిటలాడాయి. కుయుక్తులు పన్ని వలంటీర్ వ్యవస్థను రద్దు చేయించిన బాబు.. మళ్లీ పింఛన్ పంపిణీ కూడా ఎక్కడ అడ్డుకుంటాడో అనే ఆందోళనతో ఉదయం 7 గంటల నుంచే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు సచివాలయాలకు తరలివచ్చారు.

వేర్వేరు చోట్ల నలుగురి మృతి

పింఛన్ల కోసం మండుటెండల్లోనే సచివాలయాల వద్దకు వచ్చిన వృద్ధులు ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. తాడిపత్రికి చెందిన ఇద్దరు, కణేకల్లు మండలానికి చెందిన ఒక వ్యక్తి వడదెబ్బ తగిలి మృతి చెందగా, పింఛన్ అందదేమోనన్న బెంగతో శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో ఒకరు మృత్యువాత పడ్డారు.

కుటుంబీకుల ఆందోళన

వలంటీర్ వ్యవస్థపై కక్ష కట్టిన టీడీపీ అధినేత నారా చంద్రబాబు అనుకున్నది సాధించారు. కనికరం లేకుండా ప్రవర్తించి పండుటాకులకు కష్టాలు తెచ్చిపెట్టారు. ఒకప్పుడు హాయిగా ఇంటి వద్ద పింఛన్ అందుకునే వారిని..ఎండలో మాడే స్థితికి తీసుకొచ్చారు. ఎండాకాలం నేపథ్యంలోనే ఈ దుస్థితి తలెత్తడంతో తమ వారికేమవుతుందోనని వృద్ధుల కుటుంబ సభ్యులు కూడా ఆందోళన చెందుతున్నారు.

మా ఉసురు తగులుతుంది



వృద్ధులు, దివ్యాంగులు, నిరాశ్రయుల వద్ద రాజకీయాలు చేయకూడదు. పది మందికి మంచి చేసే కార్యక్రమాలను ప్రతిపక్షాలు కూడా ప్రశంసించాలి. ఇలా అడ్డుపడటం సరి కాదు. సచివాలయాల వద్ద వృద్ధులు క్యూలో నిలబడి ఇబ్బందులు పడడం చూస్తుంటే బాధనిపిస్తోంది. చంద్రబాబుకు మాలాంటి పేదల ఉసురు తప్పక తగులుతుంది.

– గంగమ్మ, జుంజురాంపల్లి, రాయదుర్గం మండలం

తీవ్ర ఆందోళనతో వచ్చా



వచ్చే మూడు నెలలు వలంటీర్ల ద్వారా పింఛన్లు ఇవ్వరని చెప్పారు. దీంతో తీవ్ర ఆందోళనకు గురయ్యా. సచివాలయ సిబ్బంది ఇంటికే వచ్చి ఇస్తారని నాకు తెలియదు. అందుకే ఆటోలో సచివాలయానికి వచ్చా. నా వేలి ముద్రలు పడవు. ఫొటో తీసుకుని పింఛన్ అందజేసి దగ్గరుండి వారే ఆటోలో పంపించారు. ఎవరైనా సరే, వృద్ధుల పట్ల కక్ష గట్టడం మంచిది కాదు.

– వడ్డే సిద్ధశ్వరమ్మ, దివ్యాంగురాలు, రాయదుర్గం

గతంలో ఇలాంటి కష్టాలు లేవు



ఎలాంటి కష్టాలు పడకుండా వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ తీసుకునేవాళ్లం. ఈ నెల నుంచి సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలని చెప్పడంతో దాదాపు కిలోమీటర్ దూరంలో ఉన్న సచివాలయానికి అవస్థలు పడుతూ వచ్చా. సాయంత్రం పింఛన్ ఇచ్చారు. వలంటీర్లతో పింఛన్లు ఇప్పించరాదని చంద్రబాబు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వృద్ధులను ఇబ్బందులకు గురిచేయడం తగదు.

– ఉలిగమ్మ, వాల్మీకినగర్, రాయదుర్గం



కంబదూరు సచివాలయం వద్ద పింఛన్ల కోసం బారులు తీరిన లబ్ధిదారులు

పింఛన్ కోసం వెళ్తుండగా బైక్ బోల్తా

- విరిగిన దివ్యాంగురాలి కాలు



గాయపడి రోడ్డుపైనే కూర్చుండిపోయిన దివ్యాంగురాలు రజని

గుత్తి రూరల్: పింఛన్ కోసం వెళ్తుండగా బైక్ బోల్తా పడడంతో దివ్యాంగురాలి కాలు విరిగింది. వివరాలు.. మాముడూరు గ్రామానికి చెందిన రజని దివ్యాంగురాలు. గురువారం తన దివ్యాంగ పింఛన్ తీసుకునేందుకు తండ్రితో కలిసి అబ్బేదొడ్డి సచివాలయానికి బైకుపై బయలుదేరారు. మార్గమధ్యలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రజని కాలు విరగ్గా, తండ్రి ప్రసాద్‌రెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే ఆటోలో గుత్తి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తీసుకెళ్లారు. రజనిని వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు.

మీకో దండం.. మీతో ఉండం!

- టీడీపీలో చల్లారని అసమ్మతి మంటలు
- నాయకుల రాజీలను వ్యతిరేకిస్తున్న కార్యకర్తలు
- అన్ని చోట్లా ఇదే పరిస్థితి
- ఓటమి భయంతో ఉక్కిరిబిక్కిరవుతోన్న 'దేశం' అభ్యర్థులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఓవైపు అసమ్మతి సెగలు, మరోవైపు అధికార పార్టీలోకి కొనసాగుతున్న వలసలు వెరసి టీడీపీ అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో రేగిన చిచ్చు చల్లారేలా కనిపించడం లేదు. అక్కడక్కడా నేతలు కలిసినా కార్యకర్తలు మాత్రం నువ్వా నేనా అంటూ గొడవలకు దిగుతున్నారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల నుంచి నాయకులను పిలిపించుకుని సామదానభేదదండోపాయాలను ప్రయోగించినా పరిస్థితులు సద్దుమణగకపోవడంతో ఆ పార్టీ అభ్యర్థులు ఓటమి భయంతో బెంబేలెత్తుతున్నారు.

జయరామ్‌కు రాం రాం

గుంతకల్లులో సీనియర్ నేతలను కాదని గుమ్మనూరు జయరామ్‌కు సీటు ఇచ్చిన చంద్రబాబు ఫలితం అనుభవిస్తున్నారు. మొన్నటివరకూ అవినీతి మంత్రి అని తిట్టిపోసిన బాబు.. ఇప్పుడేమీ మాట్లాడలేక పోతున్నారు. జయరామ్‌కు మాజీ ఎమ్మెల్యే జితేందర్‌గౌడ్ నుంచే కాదు ప్రతి గ్రామంలోనూ వ్యతిరేకత ఎదురవుతోంది. ప్రచారం ప్రారంభించినా ఫలితం కనిపించడం లేదు.

డబ్బు ఖర్చవుతున్నా.. ప్చ్

కళ్యాణదుర్గం నియోజవకవర్గంలో బడా కాంట్రాక్టర్ అమిలినేని సురేంద్ర బాబుకు గడ్డుకాలం నడుస్తోంది. కీలక నాయకులు సహకరించకపోవడంతో సురేంద్ర పరిస్థితి దారుణంగా ఉంటోంది. డబ్బు ఖర్చవుతున్నా పరిస్థితి ఏ మాత్రం మెరుగుపడటం లేదని ఆయన తన సన్నిహితులతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇక.. ఉరవకొండ టీడీపీ అభ్యర్థి పయ్యావుల కేశవ్‌కు ఓటమి భయం పట్టుకుంది. దీంతో ఓట్లను వివిధ రకాలుగా ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు సమాచారం.

మేమెందుకు కలవాలి..

పెనుకొండ నియోజకవర్గం సోమందేపల్లిలో తాజాగా హిందూపురం టీడీపీ పార్లమెంటు అభ్యర్థి బీకే పార్థసారథి, పెనుకొండ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత వర్గాలు నువ్వా నేనా అంటూ గొడవకు దిగాయి. అంతకు ముందు పార్థసారథి ఇంట్లో సవిత, బీకేలు సమావేశమైన సమయంలో కూడా ఒకరిపై ఒకరు చెప్పులు విసురుకున్నట్టు సమాచారం. మీరు రాజీ పడితే మేమెందుకు తలొగ్గాలి అని ప్రశ్నించిట్లు తెలిసింది. దీంతో సవిత, బీకే ఇద్దరూ ఒకేసారి కలిసి ప్రచారానికి వెళ్లే పరిస్థితి కనిపించడం లేదు.

'పల్లె'పై తీవ్ర వ్యతిరేకత

నానా కష్టాలు పడి తన కోడలికి పుట్టపర్తి సీటును దక్కించుకున్న పల్లె రఘునాథరెడ్డికి అడుగడుగునా అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గంలో వడ్డెర సామాజిక వర్గం నేతల నుంచి వ్యతిరేకత ఎదురవుతోంది. తొలినుంచి ఈ సామాజిక వర్గం 'పల్లె' తీరుపై గుర్రుగా ఉంది. పల్లపు జయచంద్రమోహన్ ఏకంగా చంద్రబాబు ఇంటివద్దే ధర్నా చేశారు. టికెట్‌కు యత్నించిన డీఎస్పీ వేణుగోపాల్ తాజాగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీంతో పల్లె రఘునాథరెడ్డి కోడలు సింధూర రెడ్డి దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ఏ మండలానికి వెళ్లినా కేడర్ సహకరించకపోవడంతో ఆమె ఉక్కిరిబిక్కిరవుతున్నారు.



అనంతపురంలోని గుత్తిరోడ్డులో దగ్గుపాటి వర్గీయులతో ఘర్షణకు దిగిన వైకుంఠం అనుచరులు

దగ్గుపాటికి పరాభవం

- ప్రచారాన్ని అడ్డుకున్న వైకుంఠం వర్గీయులు

అనంతపురం క్రైం: అనంతపురం అర్బన్ టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్‌కు పరాభవం ఎదురైంది. ఆయన ఎదుటే తెలుగు తమ్ముళ్లు బాహాబాహీకి దిగారు. దగ్గుపాటి వర్గీయులు, వైకుంఠం అనుచరులు ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. గురువారం టీడీపీ అభ్యర్థి దగ్గుపాటి ప్రసాద్ నగరంలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి వర్గం స్థానిక గుత్తిరోడ్డులోని కనకదాసు విగ్రహం వద్ద ప్రచారానికి అడ్డుపడ్డారు. చౌదరి అనుమతి తీసుకోకుండా ప్రచారం చేస్తే సహించేది లేదన్నారు. రూ. కోట్లు పోసి టికెట్టు కొని తమ నేతకు అన్యాయం చేశారంటూ మండిపడ్డారు. ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ సర్ది చెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. చంద్రబాబు, లోకేష్‌లను తీవ్రంగా విమర్శిస్తూ నినాదాలు చేయడంతో రెండు వర్గాల మధ్య చిచ్చు రాజుకుంది. వన్‌టౌన్ పోలీసులు రంగంలోకి దిగి రెండు వర్గాలనూ చెదరగొట్టారు.

నచ్చజెప్పే నాథుడు కరువు..

టికెట్లు ప్రకటించిన టీడీపీ అధినేత చంద్రబాబు తర్వాత గాలికి వదిలేశారు. ఆవేదనలో కూరుకుపోయిన నేతలను కనీసం ఓదార్చే నాథుడు లేకపోయాడు. సీటిచ్చాం తన్నుకు చావండన్నట్లుగా వ్యవహరిస్తుండటంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. ఇదే అదునుగా కొంత మంది ద్వితీయ శ్రేణి నేతలు వ్యతిరేక వర్గాన్ని మీతో కలుపుతామంటూ నమ్మబలికి టీడీపీ అభ్యర్థుల నుంచి లక్షలాది రూపాయలు దండుకుంటున్నట్లు తెలిసింది.

మర్తాడులో దొంగల బీభత్సం

- పట్టపగలే ఇంట్లో 40 తులాల బంగారు ఆభరణాల చోరీ
- రూ.2 లక్షల అపహరణ



బీరువాలో వస్తువులను పడేసిన దృశ్యం

గార్లదిన్నె: మండల పరిధిలోని మర్తాడులో దొంగలు బీభత్సం సృష్టించారు. పట్టపగలే ఓ ఇంట్లోకి చొరబడి 40 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.2 లక్షలు అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు.. గ్రామానికి చెందిన తులశమ్మ భర్త గతంలోనే మరణించారు. కుమార్తెకు వివాహమై అనంతపురంలో ఉంటోంది. కుమారుడు చెన్నైలో ఉంటున్నారు. దీంతో తులశమ్మ గ్రామంలోని ఇంట్లో ఒంటరిగా జీవనం సాగిస్తోంది. గురువారం ఉదయం ఇంటికి తాళం వేసి, మండలంలో తన బంధువుల గ్రామమైన తిమ్మంపేటకు వెళ్లింది. పని ముగించుకుని మధ్యాహ్నం తిరిగి వచ్చిన ఆమెకు ఇంటి తాళాలు పగులగొట్టిన స్థితిలో కనిపించాయి. దీంతో ఆందోళనకు గురైన తులశమ్మ ఇంట్లోకి వెళ్లగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. అందులో ఉన్న 40 తులాల బంగారు నగలు, రూ.2 లక్షలు కనిపించలేదు. తులశమ్మ గ్రామస్తులతో కలిసి పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ శ్రీధర్ ఘటనా స్థలం చేరుకుని బాధితురాలితో మాట్లాడారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలతో తనిఖీలు చేపట్టారు. దుండగులు చేతులకు గ్లౌజులు ధరించి, ఘటన స్థలంలో ఎలాంటి ఆధారాలు దొరకకుండా జాగ్రత్త పడినట్లు పోలీసులు నిర్ధారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామన్నారు. కాగా, గురువారం ఉదయం తులశమ్మ ఇంటి వెనుక వైపు నుంచి బురఖా ధరించిన ముగ్గురు పారిపోతూ కనిపించినట్లు స్థానికులు తెలిపారు.

జిల్లాకు త్వరలో ఎన్నికల పరిశీలకులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్, చిత్రంలో కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ రామకృష్ణారెడ్డి

- సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉండాలి
- అధికారులకు ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశం

అనంతపురం అర్బన్: ''ఎన్నికల పరిశీలకులు త్వరలో జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు చేయండి. అదే విధంగా పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి సమగ్ర నివేదికలు సిద్ధంగా ఉంచుకోవాలి. పరిశీలకులకు లైజన్ అధికారులను నియమించాలి.'' అని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ జి.రామకృష్ణారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు త్వరలో జనరల్, ఎక్స్‌పెండేచర్, పోలీసు అబ్జర్వర్లు (పరిశీలకులు) రానున్నారన్నారు. అనంతపురం, కళ్యాణదుర్గం, రాయదుర్గం, తాడిపత్రిలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహాల్లో, జిల్లా పరిషత్, ఆర్‌డీటీ, ఎస్కేయూ, జేఎన్‌టీయూ అతిథి గృహాలను పరిశీలించి అవసరమైన తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. అతిథి గృహాల్లో ఫర్నీచర్, కంప్యూటర్లు ఏర్పాటు చేయాలన్నారు. పరిశీలకుల కోసం వాహనం, వీడియో గ్రాఫర్, గన్‌మెన్లు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. చెక్‌లిస్ట్ తయారు చేసుకుని తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలన్నారు. పరిశీలకులు ఎక్కడికి వెళ్లినా సంబంధిత రిటర్నింగ్ అధికారులు సమాచారం అందించాలన్నారు. సమావేశంలో ఆర్‌డీఓ జి.వెంకటేష్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ ఓబుళరెడ్డి, డీఎల్‌డీఓ శంకర్, పరిశ్రమల శాఖ ఏడీ రాజశేఖర్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలి

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి ఇంటింటికీ బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ జాగ్రత్తగా చేపట్టాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక నవోదయ కాలనీలో ఎండీయూ వాహనం ద్వారా బియ్యం, సరుకుల పంపిణీని ఆయన పరిశీలించారు. ప్రతి నెల సక్రమంగా బియ్యం, సరుకులు ఇస్తున్నారా..? తూకాలు సక్రమంగా వేస్తున్నారా..? పంపిణీ క్రమంలో ఏమైనా ఇబ్బంది కల్పిస్తున్నారా..? రాగిపిండి, జొన్నలు నాణ్యతగా ఉన్నాయా..? అంటూ కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. సరుకులు నాణ్యతగా ఉన్నాయని వారు చెప్పడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ బియ్యం, నిత్యావసర సరుకులు ఇంటింటికీ చేరాలన్నారు. కార్డుదారులను ఇబ్బందికి గురిచేయకుండా సక్రమంగా పంపిణీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారి శోభరాణి పాల్గొన్నారు.

6 వేల ఎకరాల్లో 'డ్రైల్యాండ్ హార్టికల్చర్'కు ప్రణాళిక

- డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి



అనంతపురం టౌన్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 6 వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. 5 ఎకరాల్లోపు మెట్ట భూములున్న రైతులు పథకానికి అర్హులన్నారు. మామిడి, జామ, సపోట, అల్లనేరేడు, చీనీతో పాటు అంజూర, డ్రాగన్ ఫ్రూట్ తదితర పండ్ల మొక్కలు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఎకరాలోపు భూమి ఉన్న రైతులు మునగతోపాటు అంతర పంటగా మల్లె, కనకాంబరం తదితర పూల మొక్కలు సాగు చేసుకోవచ్చన్నారు. ఆసక్తి ఉన్న రైతులు మండల కేంద్రాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోజు వారీ వేతనం రూ.300..

ఉపాధి పనులకు వచ్చే కూలీలకు రోజు వారీ వేతనం రూ.300గా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పీడీ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గతేడాది కనీస వేతనం రూ.272గా ఉండేదన్నారు. పెరిగిన వేతనాలపై ఉపాధి కూలీలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఇద్దరి సస్పెన్షన్

అనంతపురం అర్బన్: ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘించిన ఇద్దరిని సస్పెండ్ చేస్తూ ఇన్‌చార్జ్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన వారిలో రాప్తాడు మండలం గాండ్లపర్తికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ డి.వి జయశంకర్, గుంతకల్లు మండలం అమీన్‌పల్లికి చెందిన డీలర్ గుర్రం వేణుగోపాల్ ఉన్నారు. కాగా, స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో రూ.1,81,12,490 నగదు పట్టుబడింది. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టం ద్వారా ఇప్పటి వరకూ రూ.41,97,466 విలువ చేసే 10,570.16 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

కోళ్ల ఫారం దగ్ధం

కళ్యాణదుర్గం రూరల్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా చెలరేగిన మంటల్లో ఓ కోళ్ల ఫారం పూర్తిగా దగ్ధమైంది. గురువారం కళ్యాణదుర్గం మండలం పాపంపల్లిలో ఈ ఘటన చోటు చేసుకుంది. దాదాపు రూ.2 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు సదాశివ తెలిపాడు.

చిరుతకు పోస్టుమార్గం

గుత్తి: పెద్దవడుగూరు మండలం భీమునిపల్లి శివారులోని కొండల్లో బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన చిరుతకు గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. గుత్తి ఫారెస్ట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

అభ్యర్థికి అర్హత తప్పనిసరి

- నిర్దేశించిన ఎన్నికల కమిషన్
- నామినేషన్ దాఖలుకు సువిధ యాప్
- అభ్యర్థి వెంట ఆర్ఓ చాంబర్‌కు ఐదుగురికి అనుమతి
- అందరికీ అందుబాటులో అభ్యర్థుల అఫిడవిట్



అనంతపురం అర్బన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ప్రధాన ఘట్టం ఈ నెల 18 విడుదల అవుతుంది. అదే రోజు నుంచి ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ క్రమంలో ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే అభ్యర్థులు ఎన్నికల కమిషన్ నియమావళిని, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఇందులో భాగంగా ఎన్నికల్లో పోటీ చేసేవారికి ఉండాల్సిన అర్హతలపై ఎన్నికల కమిషన్ దిశానిర్దేశనం చేసింది. అలాగే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసేందుకు 'సువిధ' యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది.

అర్హతలు ఇవే...

- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి తప్పనిసరిగా భారత దేశ పౌరుడు అయి ఉండాలి. నామినేషన్ దాఖలు చేసే రోజుకు 25 సంవత్సరాలు పూర్తయి ఉండాలి.
- రాష్ట్రంలో ఏదైనా ఓ నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి.
- పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులైతే నలుగురు, స్వతంత్రంగా పోటీ చేసే అభ్యర్థులను 10 మంది ఓటర్లు బలపర్చాలి. బలపరిచే వారు అదే నియోజకవర్గానికి చెందిన ఓటర్లు అయి ఉండాలి.
- ఎంపీగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500 ధరావత్తు చెల్లించాలి
- ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు సాధారణ కేటగిరీ అభ్యర్థులు రూ.10 వేలు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.5 వేలు ధరావత్తు చెల్లించాలి.
- నామినేషన్ దాఖలు చేయడానికి 48 గంటలకు ముందు అభ్యర్థులు తప్పనిసరిగా తమ పేరిట ఏదేని గుర్తింపు పొందిన బ్యాంకులో ఖాతా తెరవాలి. ఆ ఖాతా ద్వారానే తమ ఎన్నికల ప్రచారానికి, ఇతర అవసరాలకు వెచ్చించిన సొమ్ముకు సంబంధించి లావాదేవీలు నిర్వహించాలి. ఖాతా పుస్తకం ప్రతిని ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలి.
- ఫారం–2బిలో నామినేషన్ పత్రం దాఖలు చేయాల్సి ఉంటుంది.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నోటరీతో కూడిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి, అతని కుటుంబ సభ్యుల స్థిర, చర ఆస్తుల వివరాలను చూపించాలి. అదే విధంగా కేసుల వివరాలను, క్రైం నెంబర్‌తో సహా పొందుపరచాలి.
- అఫిడవిటీలోని అన్ని ఖాళీలను తప్పనిసరిగా పూరించి సమగ్ర వివరాలను నమోదు చేయాలి.
- ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ప్రభుత్వ ఉద్యోగి తన ఉద్యోగానికి రాజీనామా చేయాలి. రాజీనామాను ఆమోదించినట్లుగా ప్రభుత్వం జారీ చేసిన ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌తో పాటుగా దాఖలు చేయాలి.
- అభ్యర్థులు ఇంటి, నీటి పన్ను, విద్యుత్ చార్జీ బిల్లు బకాయిలు లేనట్లుగా ధ్రువీకరణ పత్రాలు అందజేయాలి.

నామినేషన్ దాఖలు చేసేప్పుడు...

- నామినేషన్‌ను సువిధ యాప్ ద్వారా దాఖలు చేసిన తర్వాత హార్డ్ కాపీలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేసే క్రమంలో చాంబర్‌లోకి అభ్యర్థితో పాటు ఐదుగురు వ్యక్తులను మాత్రమే అనుమతిస్తారు.
- అభ్యర్థులు తమ బి–ఫారమ్, ఎ–ఫారమ్ ఒరిజినల్ అందించాలి. వీటిని నామినేషన్ గడువు ముగిసే రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు అందజేయవచ్చు.
- అభ్యర్థులు రెండు (ఒకటి స్టాంప్ సైజ్, మరొకటి పాస్‌పోర్ట్ సైజ్) ఫొటోలను నామినేషన్‌తో పాటు అందజేయాలి. అభ్యర్థి తన ఓటరు కార్డు, బలపరిచే వారి గుర్తింపు పత్రాలు ఇవ్వాలి.
- ఓ అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల (జతల) నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చు.
- నామినేషన్ దాఖలు చేసే సమయంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రతిజ్ఞ తప్పనిసరిగా చేయాలి. ప్రతిజ్ఞ చేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాలి.
- ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అభ్యర్థి తన సంతకం ఉండే విధానాన్ని విధిగా తెలియజేయాలి. అదే విధంగా బ్యాలెట్ యూనిట్‌లో తన పేరును ఎలా ముద్రించాలో వివరించి చెప్పాలి.
- అభ్యర్థి చెల్లించిన ధరావత్తుకు సంబంధించి రసీదుతోపాటు, ఎన్నికల ఖర్చును నమోదు చేసేందుకు నిర్దిష్ట నమూనాలో ఉన్న రిజిస్టర్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారి నుంచి తీసుకోవాలి.
- ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఏవైనా క్రిమినల్ కేసులు ఉంటే, వాటిని మూడు దినపత్రికల్లో ప్రకటన ద్వారా బహిర్గతం చేయాలి. అందుకు అయ్యే ఖర్చుల లెక్క చూపాలి.
- ఎన్నికల నామినేషన్ కేంద్రంలో సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అభ్యర్థులు తమ సందేహాలను ఇక్కడ నివృత్తి చేసుకోవచ్చు.
- అన్ని పత్రాలను 'సువిధ' అప్లికేషన్ (యాప్) ద్వారానే అందజేయాలి. ప్రచారానికి సంబంధించిన కార్యక్రమాలు, వాహనాలు, ఇతర వాటికి ఈ యాప్ ద్వారానే దరఖాస్తు చేసుకుంటే అనుమతి ఇస్తారు.

అఫిడవిట్ అందరికీ అందుబాటులో...

- అభ్యర్థులకు సంబంధించిన అఫిడవిట్‌ని అందరికీ తెలిసేలా అందుబాటులో ఉంచుతారు. నకలును ప్రజలు కోరితే వాటిని ఉచితంగానే అందజేస్తారు. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉంటాయి.
- రోజూ మధ్యాహ్నం 3 గంటల అనంతరం ఆ రోజు వచ్చిన నామినేషన్లపై అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు తెలియజేస్తారు.
- నామినేషన్లను, అఫిడవిట్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లోనూ, నోటీసు బోర్డులోనూ ప్రజల పరిశీలనకు ఉంచుతారు.
- నామినేషన్ దాఖలు పారదర్శకంగా ఉండేందుకు. నామినేషన్ ప్రక్రియను సంపూర్ణంగా వీడియో తీయిస్తారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

హిందూపురం అర్బన్: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని ఎంజీఎం మైదానం సమీపంలో పట్టాల పక్కనే ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ బాలాజీ నాయక్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. చామనఛాయతో ఉన్న వ్యక్తి ఎరుపు, తెలుపు డిజైన్ షర్ట్, సిమెంట్ కలర్ ప్యాంట్ వేసుకున్నాడన్నారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కిందపడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. కాగా, మృతుడి ఆచూకీ తెలిస్తే 94406 27641కు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు కోరారు.

లారీపై నుంచి కింద పడి క్లీనర్ మృతి


నగేష్‌రెడ్డి(ఫైల్)

ముద్దనూరు: ఐచర్ వాహనంపై నుంచి కిందపడి ఓ క్లీనర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం నక్కలపల్లికి చెందిన నగేష్‌రెడ్డి (32).. ఐచర్ వాహనానికి క్లీనర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో గురువారం వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలం కొర్రపాడు గ్రామంలో చీనీ లోడు కోసం డ్రైవర్ భాస్కరరెడ్డితో కలసి వచ్చాడు. డ్రైవర్ అజాగ్రత్తగా వాహనం నడుపుతూ గుంతల్లో దూసుకెళ్లడంతో వెనుక ఉన్న నగేష్‌రెడ్డి ఎగిరి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ దస్తగిరి తెలిపారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై విచారణ

తాడిపత్రి అర్బన్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్‌రెడ్డి తరపున ప్రచారంలో పాల్గొన్న యాడికి మండలం రాయలచెరువు పరిధిలోని 7వ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త అనసూయపై వేటు వేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఐసీడీఎస్ పీడీ బీఎన్ శ్రీదేవి నివేదిక సిద్ధం చేసి జిల్లా ఎన్నికల అధికారికి అందజేసినట్లు విశ్వసనీయ సమాచారం. అలాగే ఆమెను విధులకు హాజరుకావొద్దంటూ ఐసీడీఎస్ పీడీ ఆదేశాలు జారీ చేసింది. గత మంగళవారం రాయలచెరువులో ఎన్నికల ప్రచారం చేపట్టిన అస్మిత్‌రెడ్డితో ఆమె మాట్లాడుతూ.. కాలనీలోని ఓట్లన్నీ టీడీపీకే వేయిస్తానంటూ భరోసానిస్తూ చేసిన సంభాషణ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన విషయం తెలిసిందే. దీంతో గురువారం శ్రీదేవి తాడిపత్రిలోని సీడీపీఓ కార్యాలయానికి చేరుకుని అనసూయను విచారించారు. ఆ సంభాషణ వాస్తవమేనని ఈ సందర్భంగా ఆమె అంగీకరించారు. దీంతో అనసూయ వద్ద ఉన్న రికార్డులను స్వాధీనం చేసుకుని విధుల్లోకి రావద్దొంటూ ఆదేశాలు జారీ చేశారు.

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా సిలబస్ రూపకల్పన

- పీజీ కోర్సు సిలబస్ మార్పుపై ఎస్కేయూ వీసీ సమీక్ష

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానం–2020కు అనుగుణంగా పీజీ కోర్సు సిలబస్‌కు రూపకల్పన చేయాలని ఎస్కేయూ వీసీ డాక్టర్ కె.హుస్సేన్‌రెడ్డి అన్నారు. సిలబస్ రూపకల్పనపై వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాలులో క్యాంపస్ విభాగాధిపతులతో గురువారం ఆయన సమీక్షించారు. 15 రోజుల్లోపు ఆయా విభాగాల్లో సమావేశాలు నిర్వహించి సమష్టిగా చర్చించాలన్నారు. పీజీలో కొత్తగా రెండు స్కిల్ ఓరియంటెడ్ కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. గతంలో కేవలం ఒక కోర్సు మాత్రమే ఉండేదని గుర్తు చేశారు. పీజీలో మూడు సబ్జెక్టు కోర్ పేపర్‌లు ఉండనున్నాయి. నాల్గో సెమిస్టర్‌లో మొత్తం ప్రాజెక్ట్ వర్క్ ఉంటుంది. వీటిని తప్పనిసరి చేశారు. పీజీ మూడో సెమిస్టర్‌లో ఏ, బీ రెండు ఆప్షన్లు ఇచ్చారు. ఒకటి రీసెర్చ్ మెథడాలజీకి ఆప్షన్ ఉంటుంది. విద్యార్థులకు ఇష్టం అయితే రీసెర్చ్ మెథడాలజీ పూర్తి చేయవచ్చు. ఈ సిలబస్‌పై నెలాఖరులోపు బోర్డు ఆఫ్ స్టడీస్ సమావేశాన్ని నిర్వహించి ఆమోదం పొందిన అనంతరం మే మొదటి వారంలో సెనేట్ మీటింగ్‌లో అంతిమంగా ఆమోదిస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎంవీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ ఎ.కృష్ణకుమారి, వైస్ ప్రిన్సిపాల్ చిట్టా సురేష్, సెరికల్చర్ విభాగాధిపతి డాక్టర్ బి.సత్యనారాయణ, ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం, రూరల్ డెవలప్‌మెంట్ విభాగాధిపతి ప్రొఫెసర్ మునినారాయణప్ప, అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ నాగభూషణం, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ భాస్కర్‌రెడ్డి, బయోటెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ డి.మురళీధర్‌రావు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో యానిమేటర్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న యానిమేటర్ ఆంజనేయులు

బొమ్మనహాళ్: ఎన్నికల కోడ్ ఉల్లంఘించి టీడీపీ అభ్యర్థుల తరపున ప్రచారంలో కృష్ణాపురం గ్రామ వైకేపీ యానిమేటర్ ఆంజనేయులు పాల్గొనడం చర్చానీయాంశమైంది. రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాలవ శ్రీనివాసులు గురువారం సాయంత్రం బొమ్మనహాళ్ మండలం కృష్ణాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు, జనసేన ఇన్‌చార్జి మంజునాథ్‌గౌడ్‌తో ఆంజనేయులు పాల్గొని టీడీపీకి ఓటు వేయాలంటూ అభ్యర్థించారు.

వడ్డీ సహా తిరిగి చెల్లించండి

- బ్యాంక్ అధికారులకు వినియోగదారుల కమిషన్‌లో చుక్కెదురు

అనంతపురం: వినియోగదారుల నుంచి అధికంగా వసూలు చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులకు విరుద్ధంగా వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు ఎం.శ్రీలత గురువారం తీర్పు వెలువరించారు. వివరాలు.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఆశాజయరామరెడ్డి... అక్కడి కెనరా బ్యాంక్ శాఖలో రూ.8 లక్షల కారు రుణాన్ని పొందారు. కంతు మొత్తం రూ.13,240 కాగా, కోవిడ్ సమయంలో నెల కంతును రూ.12,674గా బ్యాంక్ అధికారులే సవరించారు. ఈ క్రమంలో మొత్తం రుణాన్ని ఒకే దఫా చెల్లించేందుకు సిద్ధమైన ఆయన బ్యాంక్ అధికారులను సంప్రదించి, వారు తెలిపిన మేరకు రూ.2,12,418లు చెల్లించి రుణ విముక్తుడయ్యాడు. అయితే బ్యాంక్ షరతుల మేరకు తాను రూ.1,90,110 మాత్రమే చెల్లించాల్సి ఉండగా, అదనంగా రూ.22,308 ఎక్కువ వసూలు చేసినట్లు గుర్తించిన ఆయన ఇదే అంశాన్ని బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఆ సమయంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వినియోగారుల కమిషన్‌ను ఆశ్రయించాడు. ఈ కేసు విచారణలో వాహనాన్ని పరిశీలించకుండానే వాహన పరిశీలన ఛార్జీ కింద రూ.2,183 వసూలు చేయడాన్ని బ్యాంకు సేవా లోపం కింద కోర్టు పరిగణించింది. ఛార్జీలు, రుణం చెల్లింపులో జాప్యం చేసినందుకు వడ్డీ, ఇతర పెనాల్టీ ఛార్జీలు వసూలు చేయడం బ్యాంకు సేవల్లో లోపం లేదని ప్రతివాదులు వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న వినియోగదారుల కమిషన్ బ్యాంకు వారు అధికంగా వసూలు చేసిన రూ.22,308తో పాటు పరిశీలన చార్జీలూ కలిపి మొత్తానికి 9 శాతం వడ్డీ జమ చేసి చెల్లించాలని, మనోవేదనకు గురిచేయడం, సేవా లోపానికి గాను రూ.5వేలు అదనంగా 60 రోజుల్లోపు చెల్లించాలని వినియోగదారుల కమిషన్ చైర్మన్ శ్రీలత, సభ్యులు గ్రేస్‌మేరీ, గోపీనాథ్ ధర్మాసనం తీర్పు వెలువరించింది.

వేర్వేరు కేసుల్లో చైన్‌స్నాచర్ల అరెస్ట్

- యాడికి వద్ద అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌చార్జ్ ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి

అనంతపురం/గార్లదిన్నె: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకున్న చైన్ స్నాచింగ్‌లకు సంబంధించి నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడిన వారిలో ఆర్మీ ఉద్యోగి ఉండడం గమనార్హం. వివరాలను ఇన్‌చార్జ్ ఎస్పీ ఆర్.విజయభాస్కరరెడ్డి గురువారం మీడియాకు వెల్లడించారు. గత కొన్ని రోజులుగా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చైన్ స్నాచర్లు చెలరేగిపోయారు. ఈ అంశాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా స్పెషల్ బ్రాంచ్, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అనంతపురం డీఎస్పీ టీవీ శివారెడ్డి పర్యవేక్షణలో అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ గిరిబాబు, కానిస్టేబుళ్లు శివయ్య, పాండవప్రసాద్, రామ్మోహన్‌రెడ్డి, రాజశేఖర్, గార్లదిన్నె పోలీసులు బృందాలుగా విడిపోయి నగరంలో విస్తృత దర్యాప్తు చేపట్టారు.

- ఈ ఏడాది ఆగస్టు 7న రాత్రి కల్లూరు అగ్రహారం వద్ద దుకాణానికి చేరుకున్న ఇద్దరు యువకులు... దుకాణ యజమాని నీలమ్మ దృష్టి ఏమార్చి ఆమె మెడలోని 1.5 తులాల బంగారు గొలుసు అపహరించుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో గురువారం గార్లదిన్నె మండలం తలగాచిపల్లి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న ఇద్దరిని సీఐ శ్రీధర్ అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. వారి నుంచి బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కంబదూరు మండలం వెంకటాంపల్లికి చెందిన మారుతిప్రసాద, రాములానాయక్‌గా గుర్తించారు. వీరిపై అనంతపురంలోని వివిధ ప్రాంతాలతో పాటు తాడిపత్రి, ధర్మవరం, బత్తలపల్లి, కర్నాటకలోని బళ్లారి, సింధనూరు ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాల అపహరణ కేసులున్నాయి. అలాగే అనంతపురం, తాడిపత్రి, కర్ణాటకలోని పావగడలో చైన్ స్నాచింగ్ కేసులున్నాయి. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఇన్‌చార్జ్ ఎస్పీ అభినందించారు. అలాగే నార్పల మండలం కేశేపల్లికి చెందిన ఆర్మీ జవాన్ బి.వేణు జల్సాలకు అలవాటు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్నట్లుగా గుర్తించిన పోలీసులు పక్కా ఆధారాలతో గురువారం అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి వద్ద అరెస్ట్ చేసి, 9 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

యాడికి: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు తెరలేపిన అంతర్రాష్ట్ర దొంగల ముఠా సభ్యులను యాడికి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ నాగార్జున రెడ్డి వెల్లడించారు. తెలంగాణలోని హైదరాబాద్, జీడిమెట్ల, సురరాం కాలనీకి చెందిన కిషోర్‌కుమార్, సూర్యచంద్ర, ప్రేమ్‌సాయి ముగ్గురూ జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బు సంపాదించుకునేందుకు దొంగతనాలకు తెరలేపారు. వీరిపై తెలంగాణలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఐదు కేసులున్నాయి. రెండు నెలల క్రితం గుత్తిలో తాళం వేసిన ఇళ్లు, యాడికిలో తాళం వేసిన అంగడి, మూడు రోజుల క్రితం యాడికి మండలం పెద్దపేటలో తాళం వేసిన ఇంటిలో చోరీలకు పాల్పడ్డారు. పెద్దపేటలో చోటు చేసుకున్న చోరీ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ముందు రోజు టి10జ జ2149 నంబర్ గల తెల్లకారు తిరగడం సీసీ పుటేజీల్లో పోలీసులు గుర్తించారు. గురువారం యాడికిలో వాహనాల తనిఖీ చేపట్టిన సమయంలో అదే కారులో అటుగా వస్తున్న దుండగులు పోలీసులను గమనించి శరవేగంగా ముందుకు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు మరో వాహనంలో వారిని వెంబడించి పట్టుకున్నారు. కారులో ఉన్న కిషోర్‌కుమార్, సూర్యచంద్ర, ప్రేమ్‌సాయిను విచారణ చేయడంతో అసలు విషయం వెలుగు చూసింది. దీంతో వారి నుంచి రెండు జతల బంగారు కమ్మలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశారు. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

నూతన పరిశోధనలతోనే సమాజాభివృద్ధి

- జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు


ప్రసంగిస్తున్న వీసీ డాక్టర్ శ్రీనివాసరావు

అనంతపురం: నూతన పరిశోధనలతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జేఎన్‌టీయూఏ వీసీ డాక్టర్ జీవీఆర్ శ్రీనివాసరావు అన్నారు. జేఎన్‌టీయూఏలోని ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఈ–మెర్జ్ 2కే24 జాతీయ సదస్సు గురువారం నిర్వహించారు. ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ కాంపిటీషన్, సర్క్యూట్ హంట్, క్విజ్, కోడింగ్ తదితర ప్రోగ్రామ్‌లలో వివిధ కళాశాలల నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ జి.మమత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు కో–ఆర్డినేటర్‌గా డాక్టర్ డి.లలితకుమారి వ్యవహరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ సదస్సును ప్రారంభించి, ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ రంగం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ముఖ్యంగా వీఎల్ఎస్ఐ, ఎంబెడెడ్ సిస్టమ్, పవర్ ఎలక్ట్రానిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాలు ముఖ్య పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఎలక్ట్రానిక్స్ కోర్సు పూర్తి చేసిన వారికి రాబోవు రోజుల్లో విస్తృత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కుతాయన్నారు. విశిష్ట అతిథిగా హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి, ప్రస్తుతం హైదరాబాద్‌లోని జెడ్ఎఫ్ కమర్షియల్ వెహికల్ సొల్యూషన్స్ లిమిటెడ్ సీనియర్ ఇంజినీర్ లీడర్ మనోహర్ చేనేకల్ మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో కొలువులు దక్కించుకునేలా సంసిద్ధులై ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూఏ పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం.రామశేఖరరెడ్డి, ఈసీఈ ప్రొఫెసర్ విష్ణువర్ధన్, ప్రొఫెసర్ వి.సుమలత, ప్రొఫెసర్ పి.రమణారెడ్డి, డాక్టర్ కేఎఫ్ భారతి, డాక్టర్ ఏపీ శివకుమార్, స్టూడెంట్ కో–ఆర్డినేటర్ జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

అనంతపురం సిటీ/గార్లదిన్నె: గార్లదిన్నె జెడ్పీహెచ్ఎస్ వెనుక పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహాన్ని గురువారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న అనంతపురం జీఆర్పీ ఎస్ఐ విజయ్‌కుమార్ అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. నీలం రంగు గీతల షర్టు, ఆకుపచ్చ లుంగీ, కుడి చేతికి కడియం ధరించి ఉన్నాడు. గుంతకల్లు నుంచి అనంతపురం వైపుగా రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెంది ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. మిస్సింగ్ కేసులో సంబంధీకులు ఎవరైనా 85002 38200లో సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

టీడీపీ అభ్యర్థిని మార్చండి : ఎమ్మార్పీఎస్


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: డబ్బుకు చంద్రబాబు ఆశపడి ఫ్యాక్షన్‌తో సంబంధమున్న వ్యక్తిని అనంతపురం టీడీపీ అభ్యర్థిగా ప్రకటించడం సరికాదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నారాయణ స్వామి అన్నారు. తక్షణమే అభ్యర్థిని మార్చాలని సూచించారు. గురువారం అనంతపురంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అనంతపురంలో హత్యారాజకీయాలకు ఊతమిచ్చేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ అనంతపురం అభ్యర్థిగా ప్రకటించిన దగ్గుబాటి వెంకటప్రసాద్ గతంలో రాప్తాడు మండలానికి చెందిన శివప్రసాదరెడ్డి హత్య కేసులో 12వ నిందితుడిగా ఉన్నాడని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తుల వల్ల ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రసాద్‌ను మార్చి మరో వ్యక్తిని అభ్యర్థిగా నియమించాలంటూ హితవు పలికారు.

యువకుడి అనుమానాస్పద మృతి

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లి అటవీ ప్రాంతంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... బెళుగుప్ప మండలం బూదుపర్తి గ్రామానికి చెందిన భీమలింగ (32), మరో నలుగురితో కలసి గురువారం తెల్లవారుజామున కర్ణాటకలోని బాదపల్లి నుంచి నడుచుకుంటూ అక్రమంగా కర్ణాటక మద్యం తీసుకుని బయలుదేరాడు. అడవిగొల్లపల్లి ఫారెస్ట్ ప్రాంతంలోకి చేరుకోగానే భీమలింగకు పాము కాటేసింది. ఈ విషయాన్ని తనతో ఉన్న వ్యక్తులకు భీమలింగ తెలపడంతో వెంటనే అటవీ ప్రాంతం నుంచి ప్రధాన రోడ్డుకు చేరుకుని 108 అంబులెన్స్ ద్వారా కళ్యాణదుర్గంలోని సీహెచ్‌సీకి భీమలింగను చేర్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకుని ఆస్పత్రికి చేరుకున్న కుటుంబసభ్యులు.. మృతుని శరీరంపై గాయాలు గుర్తించి అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. పాము కాటేసిన ప్రాంతానికి చేరుకుని నాలుగు బాక్సుల టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, భీమలింగకు భార్య రత్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ముసలోళ్లను ఇబ్బంది పెడితే ఎలాగయ్యా?

- రెండో రోజు పింఛన్ కోసం లబ్ధిదారుల పడిగాపులు
- టీడీపీ తీరుపై మండిపాటు



ఆత్మకూరులో నడవలేని స్థితిలో ఉన్న వృద్ధుడిని సచివాలయం వద్దకు తీసుకెళ్తున్న దృశ్యం



అనంతపురంలో పింఛన్ కోసం ఎదురు చూస్తున్న లబ్ధిదారులు

అనంతపురం కార్పొరేషన్/కనగానపల్లి/ఆత్మకూరు/చెన్నేకొత్తపల్లి: పింఛన్ లబ్ధిదారులకు టెన్షన్ తప్పడం లేదు. వలంటీర్ల ద్వారా పింఛన్ పంపిణీకి బ్రేక్ పడడంతో పింఛన్ కోసం లబ్ధిదారులు సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. గురువారం అనంతపురం, కనగానపల్లి, ఆత్మకూరు, చెన్నేకొత్తపల్లిలో మండే ఎండలో వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు పింఛన్ కోసం ఎదురు చేశారు. వలంటీర్లు ఉదయాన్ని ఇంటి వద్దకే పింఛన్ అందించే వారని.. ఇప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నడవలేని స్థితిలో ఉన్న వికలాంగులు అతి కష్టం మీద సచివాలయాల వద్దకు వచ్చారు. కానీ కొన్ని సచివాలయాల్లో సకాలంలో పింఛన్ పంపిణీ జరగలేదు. వలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని వృద్ధులు కోరుతున్నారు. ఏమైనా మరో రెండు నెలలు మాత్రమే అవస్థలు పడుతాం.. మళ్లీ జగనన్న ప్రభుత్వమే వస్తుందని లబ్ధిదారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. జగన్ గెలిస్తే ఠంచన్‌గా పింఛన్ అందుతుందన్నారు. కనగానపల్లి మండలంలోని వేపకుంట పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు గంటల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చింది.

కష్టం తెలియకుండా పింఛన్ ఇచ్చేవారు



సీఎం వైఎస్ జగన్ సార్ కష్టం తెలియకుండా పింఛన్ అందించేవారు. ఇప్పుడేమో వలంటీర్లు పింఛన్ ఇవ్వకూడదని చెబుతున్నారు. మరి పింఛన్ ఇంకా ఇవ్వలేదే. ముసలోళ్లను ఇబ్బంది పెడితే ఎలా గయ్యా? వలంటీర్లు బాగా పని చేసేవారు. దయచేసి మరుసటి నెల నుంచి వలంటీర్ల ద్వారానే పిచన్ ఇప్పించండి.

– పోలక్క, తిరుమల నగర్

నడవలేని బిడ్డను తీసుకొచ్చా..



నా బిడ్డ నాగలక్ష్మి పుట్టుకతో మానసిక వికలాంగురాలు. ఇద్దరికీ పింఛన్ డబ్బే ఆధారం. ఆ వచ్చే డబ్బుతోనే ఇల్లు గడిచేది. ఇంటి బాడుగ కట్టుకోవాలి. అటువంటిది ఉన్నఫలంగా పింఛన్ ఇవ్వలేదు. ఇలాగైతే ఎలా? నిన్నటి నుంచి సచివాలయానికి రెండు సార్లు తిరిగా. ఎండలోనే కూర్చుని ఉన్నాం. ఇంత కన్నా దారుణం ఏముంది. టీడీపీ వాళ్లు చేసే పనులకు మాలాంటోళ్లు నరకం చూడాలా? వలంటీర్ల ద్వారానే పింఛన్ ఇప్పించాలి.

– వెంకటలక్ష్మి, జయన్న కాలనీ

ఇంటి వద్దే ఇవ్వాలి



నిన్నటి నెల వరకూ వలంటీర్లు ప్రతి నెలా ఇంటి దగ్గరకే పింఛన్ ఇస్తే సంతోషంగా తీసుకొనే వాళ్లం. కాని వలంటీర్లకు రాజకీయాలు అంటగట్టి వారిని పింఛన్లు ఇవ్వకుండా చేశారు. మండుటెండలో మాలాంటి వృద్ధులు కూడా సచివాలయాల వద్దకు వచ్చి పింఛన్ తీసుకోవటం కష్టంగా ఉంది.

– కొండన్న, వృద్ధుడు, కనగానపల్లి

ఎందుకంత కసి



ప్రభుత్వం ఇచ్చే ఒంటరి మహిళ పింఛన్, రేషన్ మాత్రమే ఆధారం. ప్రతి నెలా 1వ తేదీనే వలంటీర్ ఉదయ 7 గంటల కంతా పింఛన్ అందించి వెళ్లిపోయే పరిస్థితి ఉండేది. ఈనెల 3న ఇస్తామని ఇవ్వలేదు. ఇప్పుడు ఉదయం నుంచి కాచుకుని కూర్చున్నా..అదిగో ఇదిగో అంటున్నారు. అదేదో వలంటీర్లతో ఇప్పించే పద్ధతే ఉంటే బాగుండు సార్. అయినా ఎన్నికల విషయంలోకి మాలాంటోళ్లను లాగితే ఎలా? ఎందుకంత మాపై కసి. టీడీపీ వాళ్ల పద్ధతి బాగోలేదు.

– జయమ్మ, సోమనాథ్ నగర్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందాం



తగరకుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు

కనగానపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి, వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు తెలిపారు. గురువారం మండలంలోని తగరకుంట గ్రామంలో పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యేగా ప్రకాష్‌రెడ్డిని ఎంపీగా బోయ శాంతమ్మ గెలిపించాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భాగ్యమ్మ, జెడ్పీటీసీ మారుతి, అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, పార్టీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, యూత్ కన్వీనర్ అశోక్, నాయకులు గంగుల సుధీర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నారాయణస్వామి, పెద్దిరెడ్డి, రమణారెడ్డి, చంద్రశేఖర్, సాయిరాం, మహేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత యోగా శిక్షణ

అనంతపురం కల్చరల్: రాష్ట్రస్థాయి యోగా పోటీల కోసం అనంత వాసులకు ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నట్లు వివేకానంద యోగా కేంద్రం నిర్వాహకులు రాజశేఖరరెడ్డి, దివాకర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. మే 1 నుంచి జూన్ 10 వరకు ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు రామనగర్, సోమనాథనగర్, అశోక్‌నగర్, మొదటి రోడ్డు శివాలయం తదితర చోట్ల ఉచిత శిక్షణ సాగుతుందన్నారు. యోగాసనాల్లో అనంత వాసులను ప్రోత్సహించడానికి సాగే యోగా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963028694 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేట 5వ సచివాలయం, కక్కలపల్లికాలనీ–2 సచివాలయాల్లో జరుగుతున్న పింఛన్ల పంపిణీని గురువారం డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి పరిశీలించారు. పింఛన్‌దారులకు నగదు పంపిణీ చేసే విధానం, ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. వికలాంగులు, రోగులు, వీల్‌చైర్లలో ఉన్నవారి ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. రూరల్ మండలంలో మొత్తం 17,816 పింఛన్లు ఉన్నాయని ఎంపీడీఓ పుల్లయ్య తెలిపారు. వెంటనే పంపిణీ చేసేలా సంబంధిత సచివాలయ ఉద్యోగులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏ.నారాయణపురం పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా



ఎంపీడీఓ దశరథరామయ్యకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఆత్మకూరు: ప్రజాసేవకు ఆటంకం కలిగించేలా ప్రతిపక్ష పార్టీ నాయకులు చేసిన కుట్రలకు నిరసనగా వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథరామయ్యకు తమ రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. ప్రజాసేవ చేస్తున్న వలంటీర్లపై టీడీపీ ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని తెలిపారు. టీడీపీ చేసిన పనికి వికలాంగులు, వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకూ 60 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ వెల్లడించారు.

నేడు సీతమ్మ సారె సమర్పణ

అనంతపురం కల్చరల్: రాష్ట్రంలోనే తొలిసారి అనంత వేదికగా సీతమ్మ సారె సమర్పణ కార్యక్రమం శుక్రవారం జరగనుంది. గురువారం సాయిట్రస్టు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర మాట్లాడారు. 60 ఏళ్లకు ఒకసారి వచ్చే శోభకృత నామ సంవత్సర, ఫాల్గుణమాసం ద్వాదశిరోజున సీతమ్మ సారె సమర్పణ జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక కొత్తూరు అమ్మవారి శాలలో ఉదయం వినూత్న రీతిలో సాగే కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వేదపండితులతో పాటూ చిన్నజీయర్‌స్వామీజీ శిష్యబృందం అనంతకు విచ్చేస్తుందన్నారు. సీతారాముల కల్యాణోత్సవం, పట్టాభిషేకం, సారె కార్యక్రమాలను సంప్రదాయరీతిలో నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: సాయినగర్‌లోని మస్జిద్ ఏ రెహమానియాలో గురువారం రాత్రి ఇఫ్తార్ విందు జరిగింది. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ వసీం, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైఫుల్లా బేగ్, మార్కెట్ యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్ తదితరులు ఉపవాస దీక్షాపరులతో కలిసి ఇఫ్తార్ విరమించారు. ఎమ్మెల్యే స్వయంగా వారికి భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మతపెద్దలు రంజాన్ పర్వదినాల విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, ఇసాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్ బాషా, షంషుద్దీన్, జావీద్, నవీద్, ఖాజా, ముతవల్లి కరీముల్లా పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందిస్తున్న అనంత చంద్రారెడ్డి

అనంతపురం కల్చరల్: నిరుపేద ముస్లింలైన రంజాన్ పర్వదినాన్ని సంతోషంగా జరుపుకోవాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అనంత చంద్రారెడ్డి అన్నారు. గురువారం 42వ డివిజన్‌లో కార్పొరేటర్ రహంతుల్లా ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ కార్యక్రమం జరిగింది. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర రెడ్డి, కరుబ చంద్ర, రమేష్, రాజా తదితరులు ఆత్మీయ అతిథులుగా పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటెయ్యండి

- ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి
- 35, 36వ డివిజన్‌లో కొనసాగిన 'ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ'



కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే అనత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలోని 35, 36వ డివిజన్‌లోని మారుతీనగర్, రాంనగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం చేపట్టారు. సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ఏ విధంగా సేవలందించారు? సచివాలయ వ్యవస్థ ద్వారా ఎటువంటి సేవలు పొందుతున్నారు అని ప్రజలను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమైనా ఈ స్థాయిలో ప్రజల గురించి ఆలోచించిందో చెప్పాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం, జగనన్న సురక్ష, జగనన్న ఆరోగ్య సురక్ష, తదితర కార్యక్రమాలతో ప్రజలతో మమేకమయ్యామన్నారు. ప్రతి డివిజన్‌లో రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు పైగా అభివృద్ధి చేపట్టడం జరిగిందన్నారు. అంతర్గత రోడ్లు, కాలువలను ఏర్పాటు చేయించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రానున్న రోజుల్లోనూ ఇదే సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అఖండ మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వెన్నం శివరామిరెడ్డి, కార్పొరేటర్లు రహంతుల్లా, టీవీ చంద్రమోహన్‌రెడ్డి, ఇసాక్, కొండ్రెడ్డి రాధా, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, అనుబంధ సంఘాల అధ్యక్షులు సైపుల్లాబేగ్, కొర్రపాడు హుస్సేన్ పీరా, కృష్ణవేణి, డైరెక్టర్ శోభారాణి, నాయకులు ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జయచంద్రనాయుడు, నాగార్జున రెడ్డి, జావెద్, జానీ, హనుమంతు, వనారస బలరాం, ఏ1రఫీ, అబ్దుల్‌బాషా, మన్నల సత్యనారాయణ, లింగాల రమేష్, దాదాఖలందర్, రామయ్య, పార్వతి, తలారి ఉష పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి కమ్యూనిస్టు గోపాల్ కుమారుడు

కమ్యూనిస్టు గోపాల్ తనయుడు ఉదయ్‌తో పాటు పలు కుటుంబాలు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి చేరాయి. 5వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అనంత వీరికి కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధికి యువత ఆకర్షితులవుతున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడం జరిగిందన్నారు. పార్టీలోకి చేరిన వారిలో కమ్యూనిస్టు గోపాల్ తనయుడు ఉదయ్‌తో పాటు సావిత్రమ్మ, కవిత, తేజస్విని, శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతి, యశోద, నాగేంద్ర, రవి, వెంకటసాయి, సయ్యద్‌బాషా, ఎండీ రమణ, గంగరత్నమ్మ, రాము, తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, కార్పొరేటర్ జయలలిత, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, జేసీఎస్ జిల్లా కన్వీనర్ వెన్నం శివరామిరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి, క్లస్టర్ అధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, రమణారెడ్డి పాల్గొన్నారు.

నేడు 24వ డివిజన్‌లో ప్రచారం

24వ డివిజన్‌లో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఇంటింటికీ వైఎస్సార్‌సీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. నవోదయ కాలనీ ఆటోస్టాండ్ వద్ద నుంచి ప్రచారం ప్రారంభం అవుతుందన్నారు. నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

నగరంలో జోరుగా ప్రచారం



ప్రచారం చేస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: మైనార్టీల సంక్షేమానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీతోనే ముస్లింల అభ్యున్నతి సాధ్యమని మేయర్ వసీం అన్నారు. గురువారం స్థానిక సాయినగర్‌లోని మస్జిద్ ఏ రెహమాన్య మసీదు సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేయర్ వసీం, మార్కెట్‌యార్డు చైర్మన్ ఏకేఎస్ ఫయాజ్, మైనార్టీ విభాగం అధ్యక్షుడు సైపుల్లా బేగ్, వక్ఫ్‌బోర్డు చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ తదితరులు రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలకందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో హజ్‌యాత్రకు వెళ్లే వారిపై అదనపు భారం పడకుండా ముఖ్యమంత్రి జగన్ అండగా నిలిచారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రహంతుల్లా, రాష్ట్ర కార్యదర్శి నియాజ్, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కొర్రపాడు హుస్సేన్‌పీరా, వైఎస్సార్‌సీపీ నాయకుల జావీద్, నదీమ్ పాల్గొన్నారు.

భాష, సంస్కృతి విడదీయరానివి



మాట్లాడుతున్న ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎన్ రాజేంద్ర ప్రసాద్

అనంతపురం: భాష, సంస్కృతి విడదీయరానివి అని ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వీవీఎస్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. క్యాంపస్ కళాశాలలోని ఇంగ్లిష్ విభాగాధిపతి డాక్టర్ వి.మాధవి ఆధ్వర్యంలో ఎస్కే యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ఎంవీ రామశర్మ స్మారక ఉపన్యాస కార్యక్రమాలను గత రెండు రోజులుగా నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆయన విశిష్ట వక్తగా హాజరై మాట్లాడారు. ఇంగ్లిష్ విభాగంలో స్మారక ఉపన్యాసాలు ఏర్పాటు చేసినందుకు మాజీ వీసీ ఎంవీ రామశర్మ కుటుంబానికి ధన్యవాదాలు తెలిపారు. ఇంగ్లిష్ అంతర్జాతీయ భాష మాత్రమే కాకుండా అంతర సాంస్కృతిక, బహుళ సాంస్కృతిక భాష అని పేర్కొన్నారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ వి.మాధవి, టీచింగ్ అసిస్టెంట్లు డాక్టర్ హుస్సేన్‌వలి, షకీలా, పరిశోధన విద్యార్థులు రామకృష్ణ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల ప్రచారం

రాప్తాడు: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు పాలబావి, 4 గంటలకు ఎం.చెర్లోపల్లి, 5 గంటలకు ఎం.కృష్ణాపురం, 7 గంటలకు గంగలకుంట, 8 గంటలకు రామినేపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం ఉంటుందని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

పేదలను అయ్యో అనిపించావు బాబూ

- మేయర్ వసీం



అనంతపురం కార్పొరేషన్: వలంటీర్ల ద్వారా సజావుగా జరిగే పింఛన్ పంపిణీను అడ్డుకుని పేదలను టీడీపీ అధినేత చంద్రబాబు ఇబ్బందులకు గురి చేశారని మేయర్ వసీం పేర్కొన్నారు. బుధవారం మేయర్ తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పింఛన్ పంపిణీని కుట్రపూర్వకంగా టీడీపీ అడ్డుకుందని ధ్వజమెత్తారు. వలంటీర్ల ద్వారా ప్రతి నెలా మొదటి రోజునే 80 నుంచి 90 శాంతం పింఛన్ పంపిణీ పూర్తి అయ్యేదన్నారు. వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఇంటి వద్దకే పింఛన్ అందే పరిస్థితి ఉండేదన్నారు. వేసవికాలం అందులోనూ రంజాన్ మాసంలో వృద్ధులు, మహిళలు, వికలాంగులు పడుతున్న అవస్థలను అంతా ఇంతా కాదన్నారు. వీరందరినీ ఊసురుమన్పిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలు రానున్న ఎన్నికల్లో బంగాళాఖాతంలో కలిసిపోతాయన్నారు. ప్రజలన్నీ గమనిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజలకు మేలు చేసేందుకు సచివాలయ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. కేవలం రెండు నెలలు మాత్రమే లబ్ధిదారులకు అవస్థలుంటాయని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎంగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బాధ్యతలు తీసుకుంటారన్నారు. జూలై నుంచి వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే పింఛన్ అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

సర్జన్ నిర్లక్ష్యమే మృతికి కారణం

- ప్రొఫెసర్ల విచారణలో బయటపడ్డ నిజాలు
- పీజీ విద్యార్థితో వైద్య సేవలు అందించిన వైనం



విచారణ చేపట్టిన ప్రొఫెసర్లు డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఆత్మారాం

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని పలు విభాగాల్లోని సీనియర్ వైద్యులు పీజీలకు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపేసుకుంటున్నారనడానికి ఈనెల 2న సర్వజన్పాత్రిలో ఘటన ఓ నిదర్శనమని చెప్పాలి. క్షతగాత్రులు, రోగులను సకాలంలో పూర్తిస్థాయిలో చూసి అడ్మిట్ చేయకపోవడంతోనే రోగులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చినా.. కొందరు వైద్యుల నిర్లక్ష్యం రోగుల పాలిట శాపంగా మారుతోంది.

సర్జన్ చూడలేదు..

ఈనెల 3న రుద్రంపేటకు చెందిన హనుమేష్ (28) మృతి చెందిన విషయం విధితమే. బీకేఎస్ పరిధిలోని చెరువుకట్ట వద్ద జరిగిన ప్రమాదంలో రుద్రంపేటకు చెందిన హనుమేష్ అనే వ్యక్తి ఈనెల 2న మధ్యాహ్నం 3:30 గంటలకు ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు వచ్చిన విషయం విధితమే. అదే రోజు రాత్రి హనుమేష్ ఇంటికి వెళ్లాడు. ఈనెల 3న మరోసారి కుటుంబీకులు హనుమేష్‌ను ఆస్పత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. దీనిపై మృతుల బంధువులు ఆందోళన చేసిన విషయం విధితమే. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు విచారణకు ఆదేశించారు. ఆర్థో హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ ఆత్మారాం, ఎమర్జెన్సీ మెడిసిన్ హెచ్‌ఓడీ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు గురువారం ఓపీ నెంబర్ 9లో సర్జన్, పీజీ, క్యాజువాలిటీ, తదితరులను విచారించారు. విచారణలో డ్యూటీ వైద్యురాలు డాక్టర్ మృదులా (సర్జన్) మృతుడిని చూడకుండా, ఓ పీజీ విద్యార్థితో వైద్యం అందించినట్లు బహిర్గతమైంది. కాగా సకాలంలో రోగిని అడ్మిట్ చేయకుండా గంటల తరబడి ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచినట్లు విచారణలో తేలింది. శుక్రవారం మరికొందరు క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్లు, స్టాఫ్‌నర్సులను విచారణ కమిటీ విచారణ చేయనుంది.

'నాసా' పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా



విద్యార్థులతో కమిషనర్ మేఘస్వరూప్, శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: నాసా (నేషనల్ ఏరోనాటిక్స్, స్పేస్ అడ్మినిస్ట్రేషన్) అమెరికా కాంటెస్ట్–2024లో శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. వరుసగా 11వ ఏట చాంపియన్‌గా నిలిచిందని యాజమాన్యం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా 28 దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో తమ విద్యా సంస్థల విద్యార్థులు తొలి స్థానంలో నిలిచారని పేర్కొంది. హౌసింగ్ బోర్డులోని బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు జి.శ్రీనిధి, ఏ.అక్షర, సి.అను, జి.ఉదయ్‌శ్రీ, ఎం.సవ్యశ్రీ, సి.కావ్యశ్రీ, సి.యువశ్రీ, పి.నిహారిక, జి.వైష్ణవి, కె.శ్రేష్ఠ మొదటి ప్రాజెక్ట్ సాధించారు. గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీరిని నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ అభినందించారు. పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. తమ విద్యార్థులు డిజిటల్ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ అనే ప్రాజెక్ట్ రూపొందించి విజయం సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సమీనాఖాన్, ఖలందర్, విశ్వనాథ్, వెంకటేష్, ఇర్షాద్, ఫిలిప్, తబస్సుమ్, శాంతా, శ్రీదేవి, నేత్ర, పర్వీన్, అకడమిక్ కో–ఆర్డినేటర్స్ రాధాకృష్ణ, తిరుమలేష్, శ్రీనివాసులు, నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

బాబును చిత్తుగా ఓడిద్దాం



మాట్లాడుతున్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

రాప్తాడు: కుట్ర రాజకీయాల్లో ఆరితేరిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడిని వచ్చే ఎన్నికల్లో చిత్తుగా ఓడిద్దామని నియోజకవర్గ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని మసీదులో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని, మాట్లాడారు. చంద్రబాబు సకాలంలో పింఛన్ దక్కకుండా అడ్డుపడ్డారని విమర్శించారు. ఈ రోజు లక్షలాది అవ్వా, తాతలు పింఛను తీసుకునేందుకు గ్రామ సచివాలయల దగ్గరకు వెళ్లి చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. జగన్ సంక్షేమ పాలనను చూసి 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు సిగ్గు పడాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమ విలువైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి పెత్తందార్లను తరిమి తరిమి కొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం మండల ఇన్‌చార్జి చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, మాజీ ఎంపీటీసీ వెల్పుల రాజశేఖర్, ముస్లీం మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్

తెలుగింటి వెలుగులు

ఏ సంప్రదాయ వేడుకైనా అమ్మాయిలను ముందుగా ఆకట్టుకునేది లంగాఓణీ, గాగ్రాచోలీలు. తెలుగు సంవత్సరాది సందర్భంగా ఎంచుకోదగిన హాఫ్‌శారీ కలర్ కాంబినేషన్స్, తక్కువ ఖర్చుతో డిజైన్ చేసుకోవడం ఎలా .. అనే విషయాలపై అవగాహన ఎప్పుడూ అవసరం ఉంటూనే ఉంటుంది.

పండగల సమయంలో ముదురు, కాంతిమంతమైన రంగులున్నవి ఎంచుకుంటే కళగా కనిపిస్తుంది. పెళ్లిళ్లకు కూడా పై విధంగానే ఎంచుకోవాలి. పుట్టినరోజులు, రిసెప్షన్ వంటి వెస్ట్రన్ టచ్ ఉన్న వేడుకలకు పేస్టల్ షేడ్స్ రిచ్‌గా ఉంటాయి.

డార్క్ కలర్స్ లెహంగా చోలీలు ధరించినప్పుడు గోల్డ్, టెంపుల్ జ్యూయలరీ బాగుంటుంది. పేస్టల్ కలర్స్‌కి డైమండ్స్, కుందన్, ముత్యాలను కూర్చిన ఆభరణాల అలంకరణ అందంగా ఉంటుంది.

హాఫ్ శారీస్ ఫ్యాబ్రిక్, ఎంబ్రాయిడరీ వర్క్‌ను బట్టి ఖర్చు పెరుగుతుంటుంది. గ్రాండ్ లుక్‌తోనూ కావాలనుకుంటే ఫ్యాబ్రిక్ ఎంపిక సరైనదిగా ఉండాలి. పెద్ద పెద్ద జరీ బార్డర్స్ ఉన్న మెటీరియల్‌ను ఎంచుకుంటే బాగుంటుంది. మగ్గం వర్క్స్ డిజైన్స్ బట్టి ఖర్చు పెరుగుతుంటుంది.

పిల్లలు కూడా పండగలు, వివాహ వేడుకలలో ముదురు, కాంతిమంతమైన రంగులను ఇష్టపడుతున్నారు. పిల్లల డ్రెస్ డిజైన్స్‌లో కలర్స్, ఆభరణాల విషయంలో సింపుల్‌గా ఉంటేనే బాగుంటుంది.



సంయుక్తారెడ్డి, ఫ్యాషన్ డిజైనర్, హైదరాబాద్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బిహార్ నుంచి 25 ఏళ్ల శాంభవి చౌదరి ఎన్నికల్లో పోటీ చేయనుంది. దేశంలో అతి చిన్నవయసు మహిళా దళిత అభ్యర్థిగా శాంభవి వార్తల్లో నిలిచింది. రాజకీయ కుటుంబం నుంచి వచ్చినా తాను వేయదగ్గ ముద్ర... తనదైన దృష్టికోణం ఉన్నాయంటున్నది శాంభవి.

న్యూస్‌మేకర్

అతి చిన్న వయసు దళిత అభ్యర్థి

‘నేను పనిచేసే చోట స్త్రీలు, యువతే నా లక్ష్యం. వీరికి ఆర్థిక స్వావలంబన, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తే అభివృద్ధి దానంతట అదే జరుగుతుంది’ అంటోంది శాంభవి చౌదరి. 25 ఏళ్ల 9 నెలల వయసు వున్న ఈ డాక్టరెట్ స్టూడెంట్ బిహార్‌లోని ‘సమస్తిపూర్’ పార్లమెంట్ స్థానం నుంచి లోక్ జనశక్తి పార్టీ (రామ్‌విలాస్) తరఫున పోటీ చేయనుంది. ఇది రిజర్వ్‌డ్ స్థానం. బహుశా శాంభవి దేశంలోనే అత్యంత చిన్న వయసు కలిగిన దళిత మహిళా అభ్యర్థి ఈ పార్లమెంట్ ఎన్నికల్లో. అందుకే అందరూ ఆమెవైపు ఆసక్తిగా చూస్తున్నారు.

రాజకీయ కుటుంబం నుంచి

ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ నుంచి ఎం.ఏ. సోషియాలజీ చేసి ఇప్పుడు ‘బిహార్ రాజకీయాల్లో కులం, జెండర్ ప్రాధాన్యత’ అనే అంశం మీద పీహెచ్‌డీ చేస్తున్న శాంభవి రాజకీయ కుటుంబం నుంచి వచ్చింది. ఈమె తండ్రి అశోక్ కుమార్ చౌదరి జెడి (యు)లో మంత్రి. తాత మహదేవ్ చౌదరి కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. శాంభవి భర్త సాయన్ కునాల్ సామాజిక రంగంలో ఉన్నాడు. ఈమె మామగారు మాజీ ఐ.పి.ఎస్ అధికారి ఆచార్య కిశోర్ కునాల్ దళితుల కోసం చాలా పోరాటాలే చేశాడు. చాలా గుడులలో దళిత పురోహితులను ఆయన నియమించాడు. వీరందరి మధ్యలో చదువు మీద దృష్టి పెట్టి, పరిశోధన కొనసాగిస్తున్న శాంభవి ఇప్పుడు ప్రత్యక్ష రాజకీయాల్లో దిగింది.



శాంభవి చౌదరి

నాకంటూ వ్యక్తిత్వం ఉంది

శాంభవి పోటీ చేస్తున్న లోక్ జనశక్తి పార్టీ ఎన్‌డిఏ కూటమిలో ఉంది. బిజెపి కుటుంబ వారసత్వం గురించి అభ్యంతరం చెప్పడం తెలిసిందే. ‘మీ నాన్నగారు మంత్రి. మరి మీకు సీటిచ్చారు’ అనే ప్రశ్నకు ‘నిజమే. కాని నాకు సీటు రావడంలో ఆయన ప్రమేయం మాత్రం లేదు. చిన్నప్పటి నుంచి నేను మా తాత, నాన్న పేదవాళ్ల సమస్యలు వింటూ వారి కోసం పనిచేయడం చూస్తూ పెరిగాను. అది నామీద ఎక్కడో ప్రభావం చూపింది. దళితుల్లో పుట్టి పెరిగిన వ్యక్తిగా, చదువుకున్న మహిళగా దళితుల పట్ల నాకు అవగాహన ఉంది. రాజకీయ కుటుంబం నుంచి రావడం వల్ల ప్రజలను ఎలా అర్థం చేసుకోవాలో తెలుసు. ఎలక్షన్లు సమీపించేవరకూ నేను నిలబడాలని అనుకోలేదు. కాని సమీపించాక లోక్ జనశక్తి చీఫ్ చిరాగ్ పాశ్వాన్‌తో చెప్పాను. ఆయన నా భర్తను సొంత తమ్ముడిలా చూస్తారు. అంతేకాదు, బిహార్ రాజకీయాలలో యువత రాణించాలని భావిస్తారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయన్న కారణం రీత్యానే సీట్ ఇచ్చారు’ అని తెలిపిందామె.

అత్తగారి ఊరు

పట్నాలో పుట్టి పెరిగిన శాంభవి తన అత్తగారి ఊరైన సమస్తిపూర్‌లో గెలవడానికి సిద్ధమవుతోంది. ‘ఆ ఊరి గురించి నిజం చెప్పాలంటే నాకేమీ తెలియదు. ఇప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. మొదట అక్కడ ఒక ఇల్లు కొని అక్కడే ఉంటానన్న భరోసా కల్పించాలి. ఆ ఊరి యువతతో ఇప్పటికే కాంటాక్ట్‌లోకి వెళ్లాను. ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపిస్తారు. అవి వమ్ము చేయకుండా ఉండటమే నా ప్రథమ లక్ష్యం’ అంటున్న శాంభవి రాజకీయ జీవితాన్ని త్వరలో ఓటర్లు నిర్ణయిస్తారు.



ఉగాది వస్తోంది... క్రోధి నామంతో కొత్త ఏడాదిని తెస్తోంది. కొత్తబెల్లంతో ఉగాది పచ్చడి ఎలాగూ కలుపుకుంటాం. పండుగ రోజు పచ్చడి తర్వాత ఇంకా ఏమేమి తిందాం. కొబ్బరి పాల గారెలు... మజ్జిగ వడలు చేసుకుందాం. మరికొంత సులువుగా ఓట్స్ స్మూతీ కూడా చేసుకుందాం.

ఉగాది పచ్చడి

కావలసినవి: మామిడి పిందె – ఒకటి; వేప పువ్వు – టేబుల్ స్పూన్; బెల్లం పొడి– టేబుల్ స్పూన్; చింతకాయ – ఒకటి (లేకపోతే కొత్త చింతపండు చిన్న గోళీ అంత); ఉప్పు – చిటికెడు; పచ్చిమిర్చి – ఒకటి (తరగాలి).

తయారీ: ● వేప పువ్వును తొడిమలు, ఈనెలూ తీసేసి శుభ్రంగా కడిగి పక్కన పెట్టాలి ●చింతపండును నీటిలో నానబెట్టి రసం తీసుకోవాలి ● మామిడికాయను శుభ్రంగా కడిగి తొక్క తీయకుండా సన్నగా తరగాలి ● ఒక పాత్రలో బెల్లం పొడి, చింతపండు రసం, మామిడికాయ ముక్కలు, వేపపువ్వు, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలిపితే ఉగాది పచ్చడి రెడీ. గమనిక: ఇష్టమైతే చెరుకు ముక్కలు, రుచి కోసం అరటిపండు గుజ్జు కలుపుకోవచ్చు.





ఓట్స్ స్వీట్ స్మూతీ



కావలసినవి

ప్లెయిన్ సఫోలా ఓట్స్ – అరకప్పు; అరటిపండు – 1; బాదం పాలు – అరకప్పు; నీరు – అర కప్పు; చక్కెర – పావు కప్పు.

తయారీ: ఓట్స్‌ని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఒక పాత్రలో బాదం పాలు, నీరు, అరటి పండు గుజ్జు, చక్కెర, ఓట్స్ పొడి వేసి బీటర్‌తో కలిపితే స్మూతీ రెడీ. గ్లాసులో పోసుకుని తాగడానికి వీల్లేనంత చిక్కగా ఉంటే మరికొంత నీటిని చేర్చుకోవచ్చు. స్మూతీని చల్లగా తాగాలనుకుంటే అరగంట సేపు ఫ్రిజ్‌లో పెట్టాలి లేదా స్మూతీ కోసం వాడే నీటిని ముందుగా ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరుచుకోవాలి. బాదం పాలు రెడీమేడ్‌వి తీసుకోవచ్చు లేదా బాదం పప్పులు– నీటిని కలిపి మిక్సీ వేసి పాలను తయారు చేసుకోవాలి. ఇందులో పోషకాలు సమృద్ధిగా ఉంటాయి.

పాల గారెలు

కావలసినవి: మినప్పప్పు – పావు కేజీ; నూనె – వడలు వేయించడానికి తగినంత; కొబ్బరిపాలు – లీటరు; యాలకుల పొడి– అర టీ స్పూన్; ఉప్పు– చిటికెడు; బాదం పప్పు – 10 (నానబెట్టి పొట్టు తీసి తరగాలి); జీడిపప్పు – 20; కిస్‌మిస్– టేబుల్ స్పూన్; పిస్తా– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; బెల్లం లేదా చక్కెర – అర కేజీ.

తయారీ: ● మినప్పప్పును శుభ్రంగా కడిగి నాలుగు గంటల సేపు మంచినీటిలో నానబెట్టిన తర్వాత మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ పప్పును ఒక గిన్నెలోకి తీసుకుని బీటర్ లేదా స్పూన్‌తో రెండు నిమిషాల పాటు చిలకాలి. ● స్టవ్ మీద అడుగు మందంగా ఉన్న పాత్రను పెట్టి కొబ్బరి పాలు పోసి మరిగించాలి. వేడెక్కుతున్నప్పుడు అందులో చక్కెర వేసి కలుపుతూ మరిగించాలి. చిక్కబడేటప్పుడు యాలకుల పొడి వేసి మరో నిమిషం పాటు మరిగించి దించేయాలి. ● ఇప్పుడు స్టవ్ మీద చిన్న బాణలి పెట్టి నెయ్యి వేడి చేసి అందులో బాదం, పిస్తా, జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి కొబ్బరి పాలు బెల్లం మిశ్రమంలో కలపాలి ● బాణలిలో నూనె వేడి చేసి అందులో మినపపిండిని పాలిథిన్ పేపర్ మీద వేసి వత్తి (నిమ్మకాయంత గోళీలుగా కూడా వేసుకోవచ్చు) నూనెలో వేయాలి. రెండువైపులా కాలనిచ్చి తీసి టిష్యూపేపర్ మీద వేయాలి. అదనంగా ఉన్న నూనెను పేపర్ పీల్చుకున్న వెంటనే (వేడిగా ఉండగానే) వడలను ఒక వెడల్పు పాత్రలో పరిచినట్లు అమర్చి కొబ్బరిపాల మిశ్రమాన్ని పోయాలి. వడలు ఐదు నిమిషాల్లో కొబ్బరి పాలను పీల్చుకుంటాయి. వడలు పీల్చుకున్న తర్వాత కూడా పాలు ఇంకా మిగులుగా ఉండాలి. సర్వ్ చేసేటప్పుడు కప్పులో ఒక వడ ఒక గరిటె కొబ్బరి పాలు వేసి ఇవ్వాలి.



మజ్జిగ వడ

కావలసినవి: అటుకులు – కప్పు; రవ్వ – పావు కప్పు; మజ్జిగ– అర కప్పు; పచ్చిమిర్చి – 2 (తరగాలి); అల్లం తరుగు – టేబుల్ స్పూన్; నువ్వులు – టీ స్పూన్; కరివేపాకు – రెండు రెమ్మలు (తరగాలి); కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూన్; జీలకర్ర – అర టీ స్పూన్; బియ్యప్పిండి లేదా ఓట్స్ – టేబుల్ స్పూన్; ఉల్లిపాయ తరుగు – 2 టేబుల్ స్పూన్‌లు; కొబ్బరి తురుము – టేబుల్ స్పూన్; ఉప్పు – టీ స్పూన్ లేదా రుచిని బట్టి; పచ్చి శనగపప్పు– టేబుల్ స్పూన్; నూనె– వేయించడానికి తగినంత.

తయారీ: ● అటుకులను వెడల్పు పాత్రలో వేసి నీటిని పోసి కడిగి వేరొక పాత్రలోకి తీసుకోవాలి. అటుకులను నీటి నుంచి వేరు చేయడానికి నీటిని వంపకూడదు. నీటిలో తేలుతున్న అటుకులను చేత్తో తీసి మరొక పాత్రలో వేసుకోవాలి. ఇలా చేయడం వల్ల అటుకుల్లో ఇసుక ఉంటే నీటి అడుగుకు వెళ్లిపోతుంది. అటుకులు శుభ్రంగా ఉంటాయి. ● పచ్చి శనగపప్పు కడిగి అటుకుల్లో వేయాలి. ● అందులో రవ్వ, ఉప్పు, మజ్జిగ వేసి కలిపి ఇరవై నిమిషాల సేపు నాననివ్వాలి. ● ఇప్పుడు నానిన అటుకుల్లో అల్లం, పచ్చిమిర్చి, జీలకర్ర, నువ్వులు, కరివేపాకు, కొత్తిమీర, కొబ్బరి తురుము, నువ్వులు, బియ్యప్పిండి వేసి కలిపి పది నిమిషాల సేపు ఉంచాలి. ● ఇప్పుడు మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని వడకు సరిపోయేటట్లు ఉందా లేదా అని సరి చూసుకోవాలి. మరీ జారుడుగా ఉంటే మరికొంత బియ్యప్పిండి కలుపుకుని పిండి అంతటినీ పెద్ద నిమ్మకాయంత గోళీలు చేసి పక్కన పెట్టాలి. ● బాణలిలో నూనె వేడి చేసి అటుకుల గోళీని వత్తి మధ్యలో చిల్లు పెట్టి నూనెలో వేసి రెండు వైపులా ఎర్రగా కాల్చి తీయాలి. ఇలాగే పిండినంతటినీ చేసుకోవాలి. వేడి వేడి వడల్లోకి పుదీనా చట్నీ రుచిగా ఉంటుంది.